నిరుపయోగంగా క్రీడా మైదానాలు

- వసతులు కల్పించడంలో విఫలం
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి



కానాయపల్లితండాలో పిచ్చి మొక్కలతో నిండిన క్రీడా మైదానం

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని బయటకు తీసుకొచ్చి యువత క్రీడల్లో రాణించేలా గ్రామీణ క్రీడా మైదానాలను ఏర్పాటు చేసింది. క్రీడా మైదానాలు పూర్తయ్యి రెండేళ్లు గడుస్తున్నా కొన్ని గ్రామాల్లో స్థల వివాదాలతో మొదటికే మోక్షం లేకుండా పోయింది. పనులు పూర్తయిన వాటిలో కూడా మొక్కుబడిగా ఏర్పాటు చేసి, కనీస వసతులను మరిచారు. ఒక్కో క్రీడా మైదానానికి దాదాపు రూ.2.50లక్షలు కేటాయించినప్పటికీ పలు చోట్ల మైదానం ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయలేదు. మరికొన్ని క్రీడా మైదానాలు ఊరికి దూరంగా ఏర్పాటు చేయడంతో మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. ఇంకొన్ని చోట్ల బహిర్భూమికి వాడుతున్నారు. క్రీడా మైదానాల్లో ఒక్క రోజు కూడా ఏ ఒక్క క్రీడా నిర్వహించిన దాఖలాలు లేవు. ప్రభుత్వ సంకల్పం ఆచరణలో విఫలమవుతుందడానికి గ్రామీణ క్రీడా మైదానాలు ఉదాహరణగా నిలుస్తున్నాయి. క్రీడా మైదానాల పేరిట పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం అయినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయ లోపంతో అనువైన స్థలాలను ఎంపిక చేయకపోవడంతో అలంకారప్రాయంగా క్రీడా మైదానాలు మారాయి.

స్కూల్ బస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదానం


రక్తదానం చేస్తున్న ఎస్ఐ నరేందర్‌ను అభినందిస్తున్న ఎస్పీ

కొత్తకోట రూరల్: పోలీస్ అమరుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కొత్తకోటలోని ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని రక్తదానం చేశారు. తాము ఇచ్చే రక్తం ఇతర ప్రాణాలు కాపాడేందుకు ఉపయోగపడుతుందని, పోలీస్ అమరులు దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదానం చేయడంతో ఎంతో సంతోషంగా ఉందని వారు అభిప్రాయపడ్డారు. రక్తదానం చేసిన వారిలో కె.శేఖర్‌చారి, కొత్తకాపు అచ్చిరెడ్డి, పసుపుల విష్ణు, వెంకటేష్, నాగేష్ తదితరులు ఉన్నారు.

ఆత్మకూర్: పోలీసుల అమరవీరుల దినోత్సవంను పురస్కరించుకుని ఆత్మకూర్‌కు చెందిన యువకులు, పోలీసులు రక్తదానం చేశారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో రక్తదాన శిబిరంలో ఎస్ఐ నరేందర్‌తో పాటు పోలీసు సిబ్బంది, యువకులు 10 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారిని ఎస్పీ రావుల గిరిధర్ అభినందించారు.


అమరచింత యువకులతో ఎస్పీ

అమరచింత: అమరచింతకు చెందిన యువకులు పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవంలో భాగంగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. పట్టణానికి చెందిన కమలాకర్‌గౌడ్ ఇప్పటి వరకు 24 పర్యాయాలు రక్తదానం చేయడం అభినందనీయమంటూ ఎస్పీ గిరిధర్ మెమోంటోతో సత్కరించారు. కార్యక్రమంలో అమరచింత ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.


జిల్లా కేంద్రంలో రక్తదానం చేసిన స్కూల్ బస్సు అసోసియేషన్ సభ్యులు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



పాన్‌గల్: మండలంలోని రేమద్దులకు చెందిన జీపీ వాటర్‌మెన్ పత్తికొండ విష్ణువర్ధన్‌రెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకొని గ్రామవాసి, పారిశ్రామిక వేత్త పీట్ల కతాల్‌తో పాటు మరికొందరూ పోగు చేసిన రూ.1.50 లక్షల నగదును బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబానికి ఆర్థికసాయం పోగు చేసే విషయంలో గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడు ఎద్దుల దేవిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంపై పలువురు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కర్ణాకర్‌రెడ్డి, తిరుపతయ్య, దామోదర్‌రెడ్డి, సుందర్‌రెడ్డి, ప్రసాద్‌రావు, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని సీపీఎం నాయకుడికి గాయాలు

పాన్‌గల్: ఆటో ఢీకొని సీపీఎం మండల కార్యదర్శికి గాయాలైన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తెల్లరాళ్లపల్లి గ్రామ సమీపంలో వల్లభాపూర్ క్రాస్ రోడ్డు స్టేజీ వద్ద బస్సు కోసం గిరిజన సంఘం జిల్లా నాయకుడు, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి బాల్యానాయక్ వేచి చూస్తున్నాడు. ఈ క్రమంలో కేతేపల్లి వైపు నుంచి పాత ఇనుప సామానుతో ఉన్న ఆటో అతివేగంగా వచ్చి స్టేజీ వద్ద బోల్తా పడింది. అక్కడ నిలిచి ఉన్న బాల్యానాయక్‌కు తగలడంతో తలకు, కణతకు గాయాలయ్యాయి. గాయపడిన విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో వారు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని కారులో వనపర్తి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

జంతు సంరక్షణకు పాటుపడాలి

వనపర్తి టౌన్: జంతు సంరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, జంతువుల రక్షణకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హైదరాబాద్‌కు చెందిన హ్యూమన్ సొసైటీ డైరెక్టర్ ఎం.గుప్తా అన్నారు. ఈ మేరకు బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతు సంరక్షణ వర్క్‌షాపును అడిషనల్ కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం. గుప్తా, పశుసంవర్ధక శాఖ అధికారి కె.వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జంతువులపై ఇష్టానుసారంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. జంతువుల సంరక్షణతోనే ప్రకృతి సంపద పెరుగుతుందన్నారు.

టోర్నమెంట్‌ను పకడ్బందీగా నిర్వహిద్దాం

అయిజ: మండల స్థాయి సీఎం కప్పు టోర్నమెంట్‌ను పకడ్బందీగా నిర్వహిద్దామని తహసీల్దార్ జ్యోతి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటయ్య, ఎంఈఓ రాములుతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ జ్యోతి మాట్లాడుతూ ఈనెల 26, 28 తేదీల్లో నిర్వహించనున్న సీఎం కప్పు మండల స్థాయి టోర్నమెంట్‌కు అన్ని వసతులు కల్పించాలని సూచించారు. విద్యార్థులతో పాటు ఇతరులు కూడా క్రీడల్లో పాల్గొనవచ్చన్నారు. అండర్ 14, అండర్ 18 విభాగాలతో పాటు 18 ఏళ్ల నిండిన యువత క్రీడా పోటీల్లో పాలుపంచుకోవాలన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలను వ్యాయామ ఉపాధ్యాయులు నిబంధనల మేరకు నిర్వహించాలని సూచించారు. వసతులను ఎంపీడీఓ, ఎంఈఓలు పర్యవేక్షించాలని కోరారు.

మత్తు పదార్థాలు వాడితే కఠిన చర్యలు


బస్టాండ్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి

కొత్తకోట రూరల్: నార్కోటిక్ డ్రగ్స్‌ను గుర్తించేందుకు ఎస్పీ రావుల గిరిధర్ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. బుధవారం సాయంత్రం ఎస్పీ ఆదేశానుసారం కొత్తకోట ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి నార్కోటిక్ డ్రగ్స్‌ను గుర్తించడానికి స్పెషల్‌గా ట్రెనింగ్ పొందిన జాగిలంతో కొత్తకోట బస్టాండ్, భద్రప్ప కాంప్లెక్స్, మదనాపురం రోడ్డు, మహేశ్వరి లాడ్జ్ తదితర ఏరియాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిషేధిత డ్రగ్స్‌ను ఎవరైనా విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు. డ్రగ్స్ వాడుతున్నట్లు, డ్రగ్స్ దొరుకుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కుర్మయ్యగౌడ్, కానిస్టేబుల్ వెంకటేశ్వర్‌రెడ్డి, స్పెషల్ డ్రైవ్ టీం సిబ్బంది శ్రీనివాసులు, శివ, రాంబాబు తదితరులు ఉన్నారు.

నవంబర్ 13 నుంచి అన్నదానం ప్రారంభం


మాట్లాడుతున్న అయ్యప్ప సేవాసమితి నాయకులు

కొత్తకోట రూరల్: పట్టణ సమీపంలో గల శ్రీభూతనాథ అయ్యప్ప అన్నప్రసాద కేంద్రంలో నవంబర్ 13 నుంచి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు శ్రీభూతనాథ అన్నప్రసాద క్షేత్రం వ్యవస్థాపకుడు గోపాల గురుస్వామి, అధ్యక్షులు దూపం నాగరాజు పేర్కొన్నారు. బుధవారం అన్నప్రసాద క్షేత్రం నందు అయ్యప్ప సేవాసమితి సభ్యులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలను చర్చించారు. అయ్యప్ప మాలధారులు నియమ నిబంధనలను అదేవిధంగా కొనసాగించాలని, అయ్యప్ప సేవాసమితి నుంచి డబ్బులు తీసుకున్న వారు నవంబర్ 3 లోపు పూర్తిస్థాయిలో చెల్లించాలని సూచించారు. నవంబర్ 13న అన్నదానం ప్రారంభించి, 15 జనవరి 2024 వరకు కొనసాగించాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో భీమ కిషోర్‌కుమార్, వేముల సుధాకర్‌రెడ్డి, లింగేశ్వర్, గంగాధర్‌శెట్టి, కవిందర్‌రెడ్డి, సత్యంసాగర్, రాజశేఖర్, భాస్కర్‌సాగర్, లక్ష్మీనారాయణ ఉన్నారు.

హెల్త్ సబ్‌సెంటర్ పాతస్థలంలోనే నిర్మించాలి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏదుట్ల గ్రామస్తులు

గోపాల్‌పేట: మండలంలోని ఏదుట్లలో మంజూరయిన హెల్త్ సబ్‌సెంటర్‌ను గతంలో అనుకున్న స్థలంలోనే నిర్మించాలని ఏదుట్ల మాజీ ఉపసర్పంచ్ క్రాంతిరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఏదుట్ల గ్రామస్తులతో కలిసి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదుట్లకు గతంలో మంజూరయిన హెల్త్ సబ్‌సెంటర్‌ను బస్టాండుకు సమీపంలో ఉన్న స్థలంలో నిర్మించాలని గ్రామ పంచాయతీ పాలకమండలి నిర్ణయం తీసుకొని తీర్మానం చేసినట్లు వివరించారు. పాత స్థలాన్ని కాదని అధికారులు, కాంట్రాక్టర్, గ్రామానికి చెందిన మరికొందరు ఏదుట్ల చెరువుకు సమీపంలో క్రీడా ప్రాంగణానికి కేటాయించిన స్థలంలో హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణం పనులు చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్టాండుకు సమీపంలో కడితే గ్రామం మొత్తానికి మేలు జరుగుతుందని.. అలా కాకుండా ఊరుకు చివర చెరువుకు సమీపంలోని బొందలగడ్డ సమీపంలో నిర్మిస్తే గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. మళ్లీ అది బఫర్‌జోన్‌లోకి వస్తుందని తెలిస్తే ఏం చేస్తారని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి పాత స్థలంలోనే హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే రెండు, మూడు రోజుల్లో గ్రామస్తులంతా రోడ్డుమీదకు వచ్చి ధర్నాకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎర్రోళ్ల రాములు, దేవని విష్ణు, జంపుల ధర్మయ్య, బర్లవిష్ణు, మధు, ప్రవీన్, రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత


హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో మూడు రోజులుగా కొనసాగుతున్న దేవేంద్రచార్యుల ఆరాధనోత్సవాలు బుధవారం కాతేంద్రస్వామి ప్రవచాలతో ఘనంగా ముగిశాయి. చివరిరోజు దేవేంద్రచార్యుల మఠంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, అమ్మాపురం సంస్థానాధీశుడు శ్రీరాంభూపాల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈమేరకు వేలాదిగా పాల్గొన్న భక్తులకు శ్రీకాతేంద్రస్వామి ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనతో కలిసిమెలసి జీవించాలని సూచించారు. జగద్గురు దేవేంద్రచార్యుల ఆరాధనతో సకల పాపాలు హరించిపోతాయన్నారు. కార్యక్రమంలో మఠం నిర్వాహకులు నరసింహాచారి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రంగులు అద్దడంపై చిన్నారులకు శిక్షణ


స్ట్రా తో కాగితంపై ఉన్న రంగులపై ఊదుతున్న చిన్నారులు

అమరచింత: అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారులకు రంగులను స్ట్రాతో ఊదడం ద్వారా ఎలాంటి చిత్రాలు ఏర్పడతాయో అన్న విషయాలపై బుధవారం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈమేరకు అంగన్‌వాడీ టీచర్ రాధిక మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటలతో పాటు ఇలాంటి రంగులను కాగితాల్లో వేసి వాటిని స్ట్రాతో నోటి ద్వారా ఊదమని చెప్పామన్నారు. దీంతో చిన్నారులు హుషారుతో పేపర్ మీద రంగులు అద్దారని తెలిపారు. పిల్లల్లో చిన్నప్పటి నుంచి చిత్రలేఖనం, రంగులు అద్దడం వంటి కార్యక్రమాలు వారిలో సృజనాత్మకతను పెంచుతాయని వివరించారు.

జమిలీ ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం



నిరసన చేపడుతున్న సీపీఎం నాయకులు

వనపర్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' విధానాన్ని నిరసిస్తూ వనపర్తి పట్టణ సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో బుధవారం దళితవాడ కర్రెమ్మ గుడి సెంటర్‌లో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ.. పార్లమెంట్, శాసనసభలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలు జరగాలన్న రామనాథ్‌కోవింద్ కమిటీ సిఫారసులు కేంద్ర కేబినేట్ ఆమోదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వంగా జీవిస్తున్న దేశమని, ఫెడరల్ రాజ్యాంగంలో నడుస్తున్న ప్రజాస్వామ్య దేశమని, అనేక రాష్ట్రాలు, అనేక సాంప్రదాయాలు, అనేక మతాలకు నిలయంగా ఉందన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే మతం, ఒకే పార్టీ, ఒకే పన్ను, ఒకే భాష, ఒకే జాతి, ఒకే భోజనం శాఖాహారం, ఒకే రేషన్‌కార్డు, ఒకే రకమైన పోలీసు డ్రెస్ వంటివి కేవలం స్వదేశీ, విదేశీ పెట్టుబడుదారులకు సరుకులు దేశవ్యాప్తంగా అమ్ముకునేందుకు ఉపయోగపడుతుందని విమర్శించారు. బీజేపీ అధ్యక్ష పరిపాలన కోసం తహతహలాడుతుందని ఆరోపించారు. దీనిని ప్రజాస్వామ్య, లౌకిక వాదులు పెద్ద ఎత్తున వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పరమేశ్వరచారి, గంధం మదన్, బాలస్వామి, గట్టయ్య, భీసన్న, రాములు, చిన్నగట్టు, శేషయ్య పాల్గొన్నారు.

సీడీఎంఏ ముట్టడికి అనుమతి ఇవ్వండి



వినతి పత్రం అందిస్తున్న కార్మికులు


వనపర్తిటౌన్: మున్సిపాలిటీల్లోని కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యూలరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న చలో హైదరాబాద్ సీడీఎంఏ ముట్టడికి వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియాన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ. 25వేలు ఇవ్వాలని, కార్మికులు చనిపోతే అంతిమ సంస్కారాలకు రూ.30 వేలు చెల్లించాలని కోరారు. వయస్సు పైబడిన వారి స్థానంలో వారి వారసులకు అవకాశం ఇచ్చిన అధికారులు, ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేటగిరి వారీగా కార్మికులను స్కిల్, అన్‌స్కిల్‌గా విభజించి వేతనాలు చెల్లించాలన్నారు. అనంతరం కార్మికుల డిమాండ్ల పత్రం, సమ్మెకు సహకరించాలని పత్రాన్ని శానీటరి ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమలో కార్మిక సంఘం ప్రతినిధులు చంద్రయ్య, కురుమయ్య, లాల్, గోపాల్, యాదగిరి, వెంకటమ్మ, శాంతమ్మ, జయమ్మ,, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు కాపాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఖిల్లాఘనపురం: బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈదమ్మ అన్నారు. బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని కమాలోద్దీన్‌పూర్‌లో బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతు బాల్యవివాహాల వలన బాలికల్లో భవిష్యత్ అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. బాల్య వివాహాలే కాకుండా ఈవిటీజింగ్, మైనర్లను పనుల్లో పెట్టుకోవడం లాంటి అంశాల్లో కమిటీల సభ్యులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ ప్రత్యేక అధికారులు చైర్మన్‌గా, అంగన్‌వాడీ టీచర్ కన్వీనర్‌గా, పంచాయతీ కార్యదర్శులు సభ్యులుగా, పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా సమైఖ్య సంఘం లీడర్లు, ఏఎన్ఎంలు, యువజన సంఘాల నాయకులు, ఆశాకార్యకర్తలు, వీఓఏలు తదితర వారు 11 మందితో కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బావితో పొంచి ఉన్న ప్రమాదం


శిథిలావస్థలో ఉన్న తక్కళ్ల బావి

మదనాపురం: మండలంలోని కొన్నూరులో పాడుపడిన బావి ప్రమాదాలకు నెలవుగా మారింది. గ్రామానికి చెందిన వెంకట్రాములు ఇంటి పక్కన ఉన్న తక్కళ్ల బావి కొంతకాలంగా శిథిలావస్థలో ఉంది. దీంతో రాత్రివేళల్లో పాములు, తేళ్లు సంచరిస్తాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ రహదారి తెలియని వ్యక్తులు రాత్రి వేళలో ద్విచక్రవాహనాలపై జంగమయ్యపల్లి, కనిమెట్ట గ్రామాలకు వెళ్లే సమయంలో బావిని గుర్తించకుంటే ప్రమాదం బారిన పడే అవకాశాలు ఉన్నాయి. ప్రధానంగా ద్విచక్ర వాహనాదారులకు ఎండ్ల బండ్ల వారికి పశువులకు ప్రమాదం పొంచి ఉంది. వర్షాకాలంలో వర్షపు నీటితో నిండుతుంది. దీంతో విషసర్పాల సంచారం అధికంగా ఉంటుంది. విషయమై గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదానికి నిలయంగా మారిన బావిని పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మదనాపురం: సిలిండర్లు సరఫరా చేసే వాహనంలో బరువు కొలిచే యంత్రం తప్పనిసరిగా ఉండాలని.. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా తూనికలు, కొలతల అధికారి సత్యనారాయణ హెచ్చరించారు. బుధవారం మండలంలోని అజ్జకొల్లులో సిలిండర్లు తరలిస్తున్న ఆటోను తనిఖీ చేశారు. ఆటోలో బరువు కొలిచే యంత్రం లేకపోవడంతో గ్యాస్ ఏజెన్సీపై కేసు నమోదు చేసి రూ.3 వేల జరిమానా విధించారు.

రేపు కవి సమ్మేళనం

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలుగుభాషా చైతన్య సమితి జిల్లా కన్వీనర్ నాయికంటి నరసింహ శర్మ బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలుగుభాషా చైతన్య సమితి సంయుక్తంగా సమ్మేళనం నిర్వహిస్తోందని.. ఆసక్తిగల కవులు పాల్గొనేందుకు సెల్‌ఫోన్ నంబర్లు 94413 57400, 83412 49673 సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

జీపీ రికార్డుల పరిశీలన

వనపర్తి రూరల్: మండలంలోని అంకూర్, వెంకటాపూర్ గ్రామ పంచాయతీలను బుధవారం ఎంపీడీఓ రాఘవ సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంకూర్ ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులకు సక్రమంగా హాజరయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కవిత, విజయలత, ఫీల్డు అసిస్టెంట్ నిరంజన్ పాల్గొన్నారు.

గోపాల్‌పేట ఎస్ఐగా నరేష్‌కుమార్



గోపాల్‌పేట: స్థానిక ఎస్ఐగా బుధవారం నరేష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం అవిశ్రాంతంగా పనిచేస్తానని చెప్పారు. ఇంతకుముందు గోపాల్‌పేట ఎస్ఐగా విధులు నిర్వహించిన హరిప్రసాద్ వనపర్తి పట్టణ ఎస్ఐగా బదిలీపై వెళ్లగా.. నరేష్‌కుమార్ గోపాల్‌పేటకు వచ్చారు. గతంలో ఈయన స్పెషల్‌బ్రాంచ్ ఎస్ఐగా విధులు నిర్వహించినట్లు సమాచారం.

బైరోజు చంద్రశేఖర్‌కు సన్మానం



వనపర్తిటౌన్: మహబూబ్‌నగర్‌లో ఎంవీఎస్ కళాశాలలో కపిలవాయి లింగమూర్తి సాహిత్య పరిశోధన అంతర్జాతీయ సాహిత్య సదస్సులో వనపర్తికి చెందిన బైరోజు చంద్రశేఖర్, శ్యామ్ సుందర్‌ను ప్రజావాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న ఘనంగా సన్మానించారు. కపిలవాయి లింగమూర్తి సాహిత్యంలో ఆలయాలు, వాటి చరిత్ర అనే అంశంపై విస్తృతంగా విశ్లేషించి, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన కవులను మెప్పించడంతో ఈ మేరకు బుధవారం వారిని మహబూబ్‌నగర్ సదస్సులో సన్మానించారు. కపిలవాయి సాహిత్యంపై పత్ర సమర్పణ చేసే అవకాశం రావడం మరచిపోలేని అనుభూతిగా బైరోజు చంద్రశేఖర్, శ్యామ్‌సుందర్ తెలిపారు.

స్తంభాలు పాతారు.. కనెక్షన్ ఇవ్వడం మరిచారు



పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలకు విద్యుత్ కనెక్షన్ కోసం స్తంభాలు పాతి నెలలు గడుస్తున్నా.. కనెక్షన్ ఇవ్వడం లేదని పాఠశాల ఉపాధ్యాయులు వాపోతున్నారు. పాఠశాలకు విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో గదులల్లో ఏర్పాటు చేసిన ఫ్యాన్లు వృథాగా ఉన్నాయని, విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదని ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాతిన విద్యుత్ స్తంభాలకు కనెక్షన్ ఇవ్వాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.